అమ్మమ్మ చేతికి నా చేతిని అందిస్తూ "అమ్మమ్మా!" అన్నాను.

"ఏంతల్లీ! గోవిందనామాలు పాడమన్నావా?" అమ్మమ్మ అడిగింది ఉత్సాహంగా. నాకు అమ్మమ్మ పాడే గోవిందనామాలంటే చాలా ఇష్టం. తోచనప్పుడల్లా అమ్మమ్మచేత గోవిందనామాలు పాడించుకొని వింటూ ఉంటాను. అందుకే అమ్మమ్మకు తన మనమలూ, మనుమరాళ్ళందరిలో నేనంటే ఎక్కువ ఇష్టం.

"ఎప్పుడూ గోవిందనామాలే?" అన్నాను.

"పోనియ్, ఊర్మిళాదేవి నిద్రపాట పాడతాలే," అంటూ నా జవాబుకుకూడా ఎదురు చూడకుండానే అమ్మమ్మ "ఊర్మిళాదేవి నిద్ర" పాటను అందుకుంది.

"ఊర్మిళాదేవి నిద్రావద్దు, సీతమ్మవారి అగ్నిప్రవేశమూ వద్దు" అన్నాను చిరాగ్గా.

అమ్మమ్మ పాట ఠక్కున ఆగిపోయింది. అమ్మమ్మ వర్షంలో తడిసిన నులకమంచంలా బిగుసుకుపోయింది.

అమ్మమ్మకు కోపం వచ్చింది. తడిసి బిగిసిపోయి కోళ్ళు పైకిలేచిన నులకమంచాన్ని యధాస్థితికి తేవటం ఎంత కష్టమో; అమ్మమ్మ అలక తీర్చటంకూడా అంతే కష్టం అని నాకు తెలుసు.

"అమ్మమ్మా!" అన్నాను ప్రాధేయపూర్వకంగా. ఆమె ఉలకలేదు, పలకలేదు.

"అమ్మమ్మోయ్!" అన్నాను బ్రతిమాలుకుంటున్నట్లు.

"ఊఁ- ఏం?" అంది అమ్మమ్మ.

"ఓ కథ చెప్పు అమ్మమ్మా!" అన్నాను.

అమ్మమ్మ మంచంలో కదిలింది. ఆమె కదలికలో నాకు ఉత్సాహం కనిపించింది. లేచి కూర్చోవటానికి ప్రయత్నిస్తున్న ఆమెను వారిస్తూ "కూర్చోనక్కరలేదు, పడుకొనే చెప్పు!" అన్నాను.

ఆమె కూర్చొనే ప్రయత్నం మాని, కథ చెప్పటానికి సిద్ధం అయింది. "కథ చెబుతున్నంతసేపూ ఊఁ కొట్టాలి-తెలిసిందా?" అంది అదేదో పెద్ద షరతు పెడుతున్నట్లు.

"అలాగేలే! త్వరగా కథ చెప్పు" అన్నాను. అప్పటికప్పుడే పది దాటిపోయింది. ఆమె కథ వినాలి; మళ్ళీ దాన్ని నేను రాయాలి.

"ఉండూ మరి! అట్లా తొందరపెడితే కథ ఎట్లా వస్తుందే?" అంటూ ఆలోచనలోకి జారిపోయింది.

ఏం చేస్తాను! నోరు మూసుకొని అమ్మమ్మ ఎప్పుడు ఆ బోసినోటిని తెరుస్తుందా అని చూస్తూ కూర్చున్నాను.

"ఈ కథ నాకు మా అమ్మమ్మ చెప్పిందో, నాయనమ్మ చెప్పిందో గుర్తురావటంలేదే అమ్మాయ్!" అంది ఆలోచిస్తున్న ధోరణిలో.

"ఎవరు చెబితేనేంలే అమ్మమ్మా! నాకు ఆ కథ చెప్పు" అన్నాను, నాకు కావల్సింది కథగదా అని.

"అట్లా అనవాకే పిల్లా! ఎవరు చెప్పారో గుర్తుచేసుకోకుండా ఆ కథ చెప్పటం అంత మంచిపనికాదు" అంది.

ఆ చెప్పిన మాటలో అర్థం బోధపడక "ఏం, ఎందుకు మంచిది కాదు?" అన్నాను.

"మా అమ్మమ్మ కథ చెబితే ఒకరకంగా వుంటుంది; మా నాయనమ్మ కథ చెబితే

ఒకరకంగా వుంటుంది" అంది.

"ఎవరు చెప్పినా ఆ కథేగా! విసిగింపక చెప్పుదూ!" అన్నాను విసుక్కుంటూ.

"కథ అదేననుకో! కాని మా అమ్మమ్మ ఆ కథనే ఒకరకంగా చెప్పేది, మా నాయనమ్మ మరోరకంగా చెప్పేది" అంటూ ఆ కథ తనకు ఎవరు చెప్పారో జ్ఞాపకం చేసుకొనే ప్రయత్నంతో పడిపోయింది.

నాకు వళ్ళుమండిపోయింది.

"అమ్మమ్మకూ, నాయనమ్మకూ భేదం ఏమిటో చెప్పు ముందు" అన్నాను.

"ఈ మాత్రం తెలియదటే పిల్లా! పైగా చదువుకున్నావ్! అమ్మమ్మ అంటే అమ్మకు అమ్మ. నాయనమ్మ అంటే నాయనకు అమ్మ" అంది తన చమత్కారానికి తానే మురిసిపోతూ. నాకు మండుతున్న అగ్నిమీద నెయ్యి పోసినట్లనిపించింది.

"నే నడిగింది అదికాదమ్మమ్మా! మీ అమ్మమ్మ చెప్పే కథకూ, నాయనమ్మ చెప్పే కథకూ భేదం ఏమిటీ అని?" అన్నాను మాటల్ని కొంచెం సాగదీస్తూ.

"కథ ఒహటేనే పిచ్చితల్లీ!" అంది.

ఆమె పడుకున్న ఆ మంచాన్ని దొర్లించాలనిపించింది. అయితే మా యిద్దరికీ మధ్య అమ్మ ఒకటి వుండిపోయిందని వూరుకున్నాను.

"నువ్వే చెప్పావుగా ఏదో తేడా వుందని, బోడి తేడా!" అన్నాను ఉడుకుబోతుతనంగా.

"ఓసి భడవా! నేను అన్నానటే అలాగని?" అమ్మమ్మ దబాయింపు ధోరణికి నేను ఆశ్చర్యపోయాను.

"ముసల్దానివి. నీకు మతిమరుపు సహజమే. ఇందాక అన్నావుగా! బాగా గుర్తు చేసుకో!" అన్నాను దబాయిస్తున్నట్లు.

"నీ వయస్సెంతే పిల్లా?" అడిగింది అమ్మమ్మ తాపీగా.

"ఇప్పుడు నా వయస్సు సంగతెందుకే, నిన్ను కథచెప్పి చావమంటుంటేనూ!" ఆపైన ఏమనాలో తోచక కోపాన్ని దిగమింగుకున్నాను.

"పోనీ, నా వయస్సెంతో చెప్పుకోవే చూద్దాం" అంది ముసిముసిగా- అదే బోసిబోసిగా నవ్వుకుంటూ.

"నీ తికమక తగలెయ్యా! ఇప్పుడు వయస్సుల సంగతెందుకే కథ చెప్పమంటూ ంటేనూ!" అన్నాను కసిగా. అమ్మమ్మే నాకంటే చిన్నదై వుంటే రెండు మొట్టికాయలు పెట్టి వుండేదాన్ని.

"ఓసి పిచ్చికట్టే! ఈ మాత్రానికే యింత తికమకలో పడేదానివి; ఇహ కథ వింటే ఏమయిపోతావే అమ్మాయ్?" ఉన్న రెండు పళ్లు ఊగిసలాడుతుంటే పకపక నవ్వబోయి-రాక అమ్మమ్మ నవ్వే నవ్వేసింది అమ్మమ్మ.

ఆ నవ్వు చూస్తుంటే-కాదు వింటుంటే... కాదు అసలు వినబడందే! అదే చూస్తుంటే ఒక గుద్దుగుద్ది ఆ వున్న రెండు పళ్ళూ ఊడపెరకాలనిపించింది. కాని అమ్మమ్మ అయిపోయిందని ఊరుకున్నాను.

"అదేమిటే అమ్మమ్మా! పైగా నేను తికమకపడుతున్నానంటావ్, అంతా నువ్వే తికమకచేసి!" అన్నాను ఆశ్చర్యంగా.

